# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MARCH-2013

సంవత్సర చందా రూ.50/-

# సంక్షిప్త వార్తలు

2013 జనువరి 19వ తేదీ శనివారం ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామములో స్థానిక సంఘము స్వయంకృషితో నిర్మించుకొనిన **క్రీస్తుసంఘ** ఆలయము ను సోదరులు రిక్కీగూటం గారి చేతులమీదుగా దేవుని సేవకు ప్రతిష్ఠంపబడినది. ఆసమయములో భారతదేశపర్యటకు వచ్చిన అమెరికా సోదరులు కూడ హాజరై వాక్యపరిచర్య చేసిరి. లింగంపర్తిలోను,పరిసర ప్రాంతములోను సోదరులు యన్.ప్రసాద్ గారు వాక్యపరిచర్యచేయుచు అనేకులను క్రీసుకొరకు సంపాదించుచున్నారు.

2013 జనువరి 24వ తేదీనాడు కృష్ణాజిల్లా గుడివాడ రైల్వేకోలనీలో గొప్ప సువార్త కూడిక,సహవాస కూటము జరిగెను. దానిలో అమెరికా నుండి వచ్చిన సోదరులు లేనీజోబ్ గారు, జాషువా గూటం గారు హాజరై మంచి వాక్య పరిచర్య చేసిరి. అనేక మంది సువార్తికులు కూడ హాజరై గొప్ప సహవాసములో పాల్గొనిరి;గొప్ప ఆత్మీయనుభూతిని పొందిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. హాజరైన వారందరికి స్థానిక **క్రీస్తుసంఘము** మంచి భోజనము నేర్పాటు చేసెను. గుడివాడలోను, పరిసర ప్రాంతములోను సోదరులు యన్.మత్తయి గారు మంచి వాక్యపరిచర్య చేయుచున్నారు. గతంలో రైలుపేటలో ఒక చిన్న ఆలయమును కూడ ఆయన నిర్మించిరి.

2013 ఫిబ్రువరి మొదటి తేదీ శుక్రవారం కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో మంచి సువార్త కూటము జరిగెను. పల్లంకుర్రులో చాలాకాలమునుండి సోదరులు బూల యెహోను గారు,అయన కుమారుడు చిరంజీవి గారితో కలసి గొప్పసువార్త పరిచర్య చేయుచున్నారు. పల్లంకుర్రులో నిర్మించబడిన ఆలయము యొక్క దశమ వార్షికోత్సవముగాను,కుటుంబపరముగా పొందిన మేలులనిమిత్తమైన కృతజ్ఞత గాను ఈ సువార్త కూటము జరిగెను. స్థానికులు,పరిసర సంఘస్థులు అనేకులు హాజరైరి. సోదరులు యన్.ఏలీయాగారు,జాషువా గూటం గారు మంచి వాక్యపరిచర్య చేసిరి. హజరైన వారందరికి స్థానిక సంఘమువారు మంచి విందు నేర్పాటు చేసిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | మార్చి - 2013 | సంచిక - 8

## బాప్తిస్మము పొందుట అవుసరమా?
## (Is it necessary to be baptised ?)

ఒకడు రక్షణ పొందవలెనంటే బాప్తిస్మము అవుసరమని బైబిలు బోధించుచున్నది. ఇప్పటివరకు జరిగిన మా ప్రతి కార్యక్రమములోను మేము క్రీస్తు యొక్క రక్షణ మార్గమును క్లుప్తముగా తెలుపుచు వచ్చుచునే యున్నాము. బాప్తిస్మము అను అంశమును కొద్ది మాసముల క్రితము దైవవేదము నుండి దీర్ఘముగ పఠించి యుంటిమి. మా కార్య క్రమముల ద్వారా విని భారతదేశ మందంతటా అనేకులు బాప్తిస్మము పొంది రక్షింప బడితిమని మాకు తెలియజేసిరి. సత్యవాణి ద్వారా అనేకులు క్రీస్తులోనికిని, ఆయన సంఘములోనికిని సత్యములోనికిని నడిపింబడుచున్నందుకు దేవునికి మేము కృతజ్ఞత చెల్లించుచున్నాము. అయితే ఇంకను క్రీస్తునందు విశ్వాసము కలిగి యున్న అనేకులు బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను పూర్తిగ గ్రహించలేక పోవుచున్నారు. అందు వలన రక్షణ పొందవలెనంటే క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట అవుసరమో కాదో ఈరోజు పరిశీలించుదము.

**బాప్తిస్మము దేవుని ఆజ్ఞయై యున్నది:** యేసుక్రీస్తు పునరుత్థానుడై లేచిన తరువాత, తన శిష్యులనిట్లు ఆజ్ఞాపించెను: "పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించి తినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19,20). మరల రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు ఆజ్ఞా పించినట్లు మనము చూడ గలము. (మార్కు 16:16) అపో. పేతురు కొర్నేలి యింటి వారికి క్రీస్తును గూర్చిన సువార్తను బోధించి, యేసు క్రీస్తునామమున వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను అని అపో.కా. 10:48లో వ్రాయబడి యున్నది. యేసు క్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మమునకు ప్రజలులోబడవలెనని అపొస్తలులు బోధించిరి. రక్షణపొందుటకు యేసునందు విశ్వాసముంచుట ఎంత అవుసరమో బాప్తిస్మము పొందుట కూడ అంతే అవుసరము. బాప్తిస్మము అనవుసరము అని నీవనుకొనుచున్న యెడల, క్రీస్తు దానిని ఎందుకు ఆజ్ఞా పించెను? అందుకే "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యోహాను 14:15లో యేసు చెప్పెను. నీవు క్రీస్తును ప్రేమించు చున్నావా? అయితే బాప్తిస్మమను ఆయన ఆజ్ఞకు లోబడుము.

**దేవుని రాజ్యములో ప్రవేశించుటకు బాప్తిస్మము అవుసరమని యేసు బోధించెను:**

యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకనితో యేసు ఇట్లనెను: "ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). లేఖనముల ననుసరించి మనము నీటి ద్వారా, అనగా బాప్తిస్మముద్వారా జన్మించితేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపలేమని యేసు చెప్పుచున్నారు. పాపము నుండి విమోచింపబడుటకు బాప్తిస్మము అవుసరమని అపో.పౌలు బోధించెను: "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగాలోబడిన వారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము" అని రోమా 16:17,18లో అతడు బోధించెను. మనము దేవునికి హృదయ పూర్వకముగా లోబడవలెను. మనము సువార్తకు లోబడవలెనని 2 థెస్స 1:8లో అతడు

వ్రాసెను. యేసుక్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను వాస్తవములే సువార్తయై యున్నది (1కొరింథీ 15:3). అయితే క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములకు మనము ఎట్లు లోబడగలము? ఇప్పుడు రోమా 6:3-5 లను జాగ్రత్తగా పరిశీలించుడి : "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైయున్న యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము." బాప్తిస్మము పొందుటలో, అనగా నీటిలో ముంచబడు టలో క్రీస్తుయేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల క్రమమునకు మనములోబడుట జరుగును. అప్పుడే మనము పాపము నుండి విమోచింప బడగలము. అందుకే నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని క్రీస్తు చెప్పెను.

బాప్తిస్మము ఇప్పుడు మనలను రక్షించును అని అపో. పేతురు బోధించెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసి వేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1పేతురు 3:21). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని అపో.కా. 22:16లో వ్రాయబడి యున్నది. ఈ వాక్యములను బట్టి మనము పాపము లను కడిగివేసికొనుటకు బాప్తిస్మము అవసరమని మనకు బోధపడుచున్నది. అయితే విశ్వాసము ఒక్కటే యెట్లు రక్షించదో అట్లే బాప్తిస్మము మొక్కటే రక్షించదు. అందుకే మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొందవలెనని లేఖనములు బోధించుచున్నవి.

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట అవసరమని అపో. పేతురు పెంతెకోస్తునాడు బోధించెను. అయ్యలారా, రక్షణ పొందుటకు మేమేమి చేయవలెనని ఆనాటి జనసమూహము అపొస్తలులనడుగగా –"మీరు మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము

ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని పేతురు వారికి జవాబిచ్చెను (అపో. కా. 2:38). యేసునందు విశ్వసించిన వీరు ప్రశ్నించగా వారు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని అతడు వారికి చెప్పెను.

**క్రీస్తును ధరించుకొనుట నిమిత్తము బాప్తిస్మము అవుసరము :**

"క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని గలతీ 3:27 చెప్పుచున్నది. క్రీస్తులో యున్నవాడే క్రైస్తవుడు. బాప్తిస్మము పొందుట ద్వారా ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించగలడు. గనుక బాప్తిస్మము పొందినవాడే క్రైస్తవుడు అని మనము గ్రహించగలము.

**అంతేకాదు, క్రీస్తు సంఘములో మనము చేరవలెనన్నా బాప్తిస్మము పొందుట అవుసరము :**

"మనమందరము ఒక్క శరీరము లోనికి (అనగా ఒక్క సంఘములోనికి) ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" యని 1కొరింధి 12:13లో వ్రాయబడియున్నది. మనము యేసునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తునందున్న విశ్వాసమును ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన తక్షణమే ప్రభువు మనలను తన సంఘములో చేర్చుకొనును. నీవు మారుమనస్సు పొందిన విశ్వాసివయిన యెడల బాప్తిస్మము పొందుటకు నీవు ఆలస్యము ఎందుకు చేయవలెను? నీకు దగ్గరాయున్న క్రీస్తు సంఘమును దర్శించిన యెడల వెంటనే సంతోషముతో నీకు వారు బాప్తిస్మమిచ్చెదరు.

## దేవుని కాపుదల దుష్టత్వాన్ని రద్దు చేయును
## (The Providence of God)

పరమందొక దేవుడున్నారు! అది మనకెట్లు తెలియును? మానవ వ్యవహారాల్లో ఆయన యిచ్చు కాపుదల నడిపింపును బట్టి మనకు తెలుసు. యోసేపు, మోషే, క్రీస్తు జీవితాలను మనం ఉదాహరణగా చూచాం. సహజసంఘటనల ద్వారా దేవుని చిత్తము ఎట్లు నెరవేరినదో మనం చూడగలిగాము.

**"నరుల ఆగ్రహము నిన్ను స్తుతించును"**

దుష్టుల యొక్క జీవితాలను దేవుడు తన సంకల్పము చొప్పున ఎట్లు రద్దుపరచునో మనం ఇప్పుడు తెలిసికొందము. "నరుల ఆగ్రహము నిన్ను స్తుతించును. నీ ఆగ్రహశేషమును నీవు ధరించుకొందువు" అని కీర్త 76:10

చెప్పుచున్నది. దుష్టకోరికల వలన మానవులు పాపములోబడగా దేవుని కాపుదల చొప్పున అవి రద్దు చేయబడుట ద్వారా వారు దేవుని స్తుతింతురు అని ఈ లేఖనభాగము యొక్క అర్ధము. దుష్టుల యెడల కూడ కనికరము చూపించుట ద్వారా వారు తలంచిన కీడునుండి మేలు సంభవించును. అట్లు నడిపించబడని దానినంతటినీ దేవుడు అదుపుచేయును. మానవులమైన మనమే శత్రువ్యూహము లను కొన్నిసార్లు పటాపంచలు చేయ గలిగితే, సర్వజ్ఞానియైన దేవునికి అది ఇంకెంతసాధ్యము?

**ఫరోహృదయమును దేవుడెట్లు కఠిన పర్చారు ?**

ఇశ్రాయేలీయులను ఐగుప్త బానిసత్వము నుండి విడిపించుటకు మోషే ఐగుప్తుకు వెళ్లగా, ఫరో తన హృదయమును కఠినపరచుకొనెనని బైబిలు చెప్పుచున్నది (నిర్గమ 7:13,22, 8:15,19,32;9:7). అయితే ఆరవ మారు తరువాత దేవుడు అతని హృదయ మును కఠినపరచెను (నిర్గమ 9:12). మోషే ఫరో యొద్దకు వెళ్లక ముందే ఆయన ఫరో హృదయమును కఠిన పరచెదనని చెప్పెను (నిర్గమ 7:9). దేవుడు దానినెట్లు చేసారు ? ఫరోపై ఏదైనా అద్భుత శక్తిని ప్రయోగించెనా? కానే కాదు. గాని సహజ సంఘటనల ద్వారానేకదా.

ఒక గొప్ప దేశమును పాలించు గొప్ప రాజుగా ఫరోయున్నాడు. అతనికి ఒక గొప్పజనాంగము దాసత్వము చేయుచుండిరి. యిది వారికి గొప్పలాభ కరముగా యుండెను, గాని మోషే అకస్మాత్తుగా ప్రత్యక్షమై ఆబానిసలను విడుదల చేయుమని కోరెను. యిది తనకు ఏమాత్రము క్షేమము కాదని వెంటనే ఫరో తలంచెను. అతడు గొప్ప బలవంతుడైన రాజు గనుక తన్ను అట్టి కోరికను అడుగుచున్నవాడెవడో తెలిసికొనగోరాడు. "ఫరో –నేనతని మాట విని ఇశ్రాయేలీ యులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను. ఇశ్రాయేలీయులను పోనియ్యననెను" (నిర్గమ 5:2).

ఫరో యొక్క హృదయము కఠిన పరచబడడానికి ఇక్కడ మొదటి సూచనను మనము గమనించ వచ్చును. గర్వము వలన అతని హృదయము కఠినపరచ బడెను. ఐగుప్తుదేశపు ఏకైకఛత్రాధిపతిగా తాను వేరొకని మాట విననవుసరం లేదని తలంచాడు. మరల, "మీరు సోమరులు, అందుచేత మేము వెళ్లి యెహోవాకు బలి నర్పించుటకు సెలవిమ్మని మీరడు గుచున్నారని" అతడు అనెను (నిర్గమ 5:17). అట్లు అతడు వాస్తవికతకు అంధుడయ్యాడు. దేవునినారా ధించాలనే

ప్రజలకోరికను అతడు గ్రహించుకోలేదు. దానినతడు సోమరి తనముగా భావించాడు.

తదుపరి మోషే అహరోనులు సూచకక్రియలు చేసినప్పుడు అతని యొద్దనున్న గారడీవారి శక్తికంటే ఏమంత గొప్పదికాదని నమ్మునట్లు అపవాదిచే అతడు మోసగింపబడ్డాడు.

గనుక స్వార్ధము, గర్వము, దురభిమాన ద్వేషము, మోసము వలన ఫరో హృదయము కఠినపరచబడెనని మనం చెప్పవచ్చును. ప్రకృతి సందర్భములను బట్టి దేవుని యొక్క కాపుదల వలన ఫరో తీవ్ర శోధనకు గురిచేయబడెను. మరియు ఆ ప్రకృతి సంఘటనలు ఫరో యొక్క హృదయ కాఠిన్యమును, స్వార్థాన్ని బయలుపరచెను. ఫరోను కఠినుడుగా నుంచుటకు దేవుడు తన కాపుదలను బట్టి యేమియూ చేయలేదు. అతడు అప్పటికే కఠినుడు గానుండెను. దేవుని యొక్క ఆజ్ఞలు అట్టి కఠినుడునుండి యెట్టి స్పందన వచ్చునో అట్టి స్పందనను కలిగించెను.

**యితరులు కూడ దేవుని చేత పరి శోధించబడిరి :**

దేవుడు పరిశోధించిన వారిలో ఫరో ఒక్కడుమాత్రమే కాదని మనం గుర్తుంచుకోవాలి. తన ఏకైక కుమారుని బలి అర్పించుమని కోరబడినప్పుడు అబ్రాహాము శోధించబడెను. తన కుమారులను, ఆస్థిని ఆరోగ్యమును సంపదకోల్పోయినప్పుడు యోబు శోధించబడెను. అయితే వారు ఫరోవలెస్పందించ లేదు. "ఇదిగో ఆయన నన్ను చంపినను ఆయన కొరకు కనిపెట్టుచున్నానని" యోబు పలికాడు (యోబు 13:15). తెలియకపోయినను అబ్రాహాము దేవునికి లోబడెను. శోధనలు ఫరోలో మూర్ఖత్వమును, అహంకారమును రేకెత్తించెను. శోధింపబడగా అబ్రాహాము యొక్క విశ్వాసము, యోబు యొక్క ఓర్పు వృద్ధి జెందెను గాని ఫరోమరింత క్రూరుడాయెను. యోబు అబ్రాహాములు శ్రేష్టమైన వ్యక్తులు, ఫరో మరింత చెడ్డవాడు. అందువలన అతని హృదయము కఠిన పరచబడెను. అబ్రాహాము, యోబులు కూడ ఫరోవలె స్పందించియుంటే, దేవుడు వారి హృదయములను కఠినపరచెనని చెప్పవచ్చును, గాని శోధనలను బట్టి వారు శ్రేష్టులైరి, ఫరోమూర్ఖుడయ్యెను. ఒకరికి యేది ఆశీర్వాదమో మరొకనికి అది శాపమాయెను.

దీనియంతటిలోను మేలు చేయుటయు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వమునుండి విడుదల చేయుటయు ఆయన సంకల్పమై యుండెను. అయితే ఫరోయొక్క స్వార్థపరమైన కోరికలు దేవుని సంకల్పము నెరవేరడానికి భిన్నముగా యుండెను. దేవుని ఆజ్ఞలకు లోబడుటకు

బదులు దుష్టతలంపులు, క్రియలు రేకెత్తించబడి బలపడెను. దేవుని ఎదురాడుట వలనను, మంచిని ఎదురాడుట వలనను పాపము అవినీతి వలన కలుగు శాపము ఫరో మీదికి వచ్చెను, అతని హృదయము కఠినమాయెను.

**దేవుడు అందరికీ మేలునే కోరుకొనును :**

అందరికి మంచినే దేవుడు కోరుకొనును. అందువలననే ఆయన నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నారు. నీతిమంతులు అనీతిమంతులు కూడ అందువలన మంచి పంటను కోయగల్గుదురు. అయితే ఈదీవెనను అనీతిమంతుడు పాపము చేస్తు దుర్వినియోగము చేయును. నీతి మంతుడైతే అదే దీవెనను ప్రజలక్షేమార్థమై వినియోగిస్తు దేవుని మహిమ పరచును; కీడు కంటే మేలును కలుగజేయును.

అదేరీతిగా మనుష్యులందరు రక్షింపబడి సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నారు. అందు వలన సత్య వాక్యమునుపదేశించువారు అన్ని తరగతుల ప్రజల యొద్దకు వెళ్లుదురు. కొందరు మేలు పొందుదురు. మరికొందరు సత్యమును తిరస్కరింతురు. తమ తిరస్కారము వలన హృదయమును కఠిన పరచుకొందురు. గనుక యేది మంచిదో, యేది మానవుల రక్షణార్థమై ఉద్దేశించబడినదో దాని వలననే దుష్టులు కఠినపరచబడి మూర్ఖులగుదురు, పాపములోనే అంతమవుదురు.

ఫరోను గూర్చిన ఈ పాఠమును ముగించక ముందు ఇంకొక లేఖన భాగాన్ని మనం గమనించాలి. నిర్గమ 9:16లో దేవుడు ఫరోతో "నాబలమును నీకు చూపునట్లును, భూలోకమందంతటా నానామమును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని" అనెను. అంటే దేవుని యొక్క శక్తిని చూపుటకే ఫరో నియమింపబడెనని దీని యర్థమా? కానేకాదు. పాపము చేయుటకు దేవుడు ఫరోను ఎన్నడు నియమించలేదు. ఫరో తన బుద్ధిపూర్వకముగానే పాపము చేయుటకు ఎంచుకొనెను. అతడు పాపియైనను సరే సింహాసనమునదిష్టించుటకు దేవుడు శక్తి నిచ్చెను. అతడు బలవంతుడై దేవుని చిత్తమునకు అవిధేయత చూపుటకు ఎంచుకొనెను. తద్వారా దేవుని శక్తి మరింత బయలు పర్చబడి ఇశ్రాయేలీయులు విడుదల పొందుటకు అవకాశము దొరికెను.

దేవుని కాపుదలయే సమస్తాన్ని జరిగించుచున్న యెడల మానవుడు స్వేచ్ఛాజీవి ఎట్లవుతాడు? దేవుడు మానవునికి స్వేచ్ఛ, యిచ్ఛ యిచ్చి సృజించారు. అందువలన ప్రతిమానవుడు తన యిష్టము

వచ్చినట్లు చలించవచ్చును, నిశ్చయించుకోవచ్చును. వివిధమానవులు దేవునిపై నమ్మకముంచ వచ్చును లేదా నమ్మకపోవచ్చును. దేవుని ప్రేమ చవి చూచినను వారు ఆయనపై తిరుగు బాటు చేయుటకు నిశ్చయించుకొనిన యెడల దేవుడు వారిని అందు విషయమై బలవంతము చేయడు. గాని ఆయన సర్వ జ్ఞానమును బట్టియు, భవిష్యత్ జ్ఞానమును బట్టియు అట్టివారి క్రియ ప్రతిఫలమును ఎరిగినవాడై అందరికి మేలు కలుగునట్లు దుష్టత్వమును రద్దు చేయును. తద్వారా ఘనత నొందును.

ప్రతిమానవుని మనస్సు క్రియ యొక్క స్థావరము, వాటిలో కొన్ని దుష్క్రియలని దేవుడెరుగును. అందు వలన వాటికి విరుగుడును అనుగ్రహించును; ఆయన కాపుదలను బట్టి వాటిని రద్దు చేయును మంచిని సాధించును. అందుకే "నరుల ఆగ్రహము నిన్ను స్తుతించును" అని కీర్తన కారుడు వ్రాసాడు (కీర్తన 76:10).

## ప్రభువైన యేసు చెప్పిన ఉపమానములు
## (The Parables of our Lord Jesus)

యేసు యొక్క ఉపదేశములు నిజంగా అసాధారణమైనవి. ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడు, ఉపదేశకుడు. యేసు సత్యస్వరూపి. అందువలన ఆయన బోధించిన దానిని ఉదాహరించెను. సరిగదా మన ప్రభువు శక్తితోను అధికారముతోను తాను బోధించిన దానిని విశదీకరించెను. ఆయన జీవితం ఆయన ఉపదేశములకు అద్దము పట్టెను. యేసు బోధించిన రీతి ఎవడును ఎన్నడును బోధించలేదు (యోహాను 7:45-46). ఆయన అధికారము గలవాని వలె బోధించెను (మత్తయి 7:28-29). కధా రూపముగను, ఉపమాన రూపముగను బోధించుటలో ఆయనకు ఆయనే సాటియాయెను. "సామాన్యజనులు ఆయనను సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37). యేసు చేసిన బోధలలో మూడవ వంతు ఉపమానములే. దైవిక సత్యములు చిత్రీకరించుటలో యేసును మించిన వాడెవడును లేడు.

క్రీస్తు శరీరధారి కాకముందు నుండే, పాతనిబంధనకాలములో ఉపమానములు వినియోగించబడెను. ప్రవక్తయైన నాతాను దావీదుకు చెప్పిన ఉపమానము వాటిలో ప్రసిద్ధి జెందినది (2 సమూ 12:1-13). ఉపమానరీతిగ బోధించు విధానము యేసులో ప్రత్యేకముగ కనబడుచున్నను, అట్లు బోధించు విధానమును ఆయన కనుగొనలేదు.

పురాతనకాలము నుండే ఉపమానములు వినియోగించబడుచుండెను.

**ఉపమానముల యొక్కనిర్వచనము :**

ఆత్మీయం సత్యములను జనులెరిగినవాస్తవములతో పోల్చి చెప్పుటయే ఉపమానము. ఇందులో ఎల్లప్పుడు తారతమ్యము కనబడును. యేసు యొక్క ఉపమానములు మత్తయి, మార్కు లూకా సువార్తలలో ముఖ్యముగా కనబడును. ఉపమానమనగా పర సంబంధ భావము గల భూసంబంధ కథనమని చెప్పుకొనవచ్చును. భూసం బంధ వాస్తవముల ప్రక్కన యేసు పరసంబంధ సత్యములను బోధించెను. ఆయన రాజ్యమును గూర్చి ఆయన బోధించెను. జనులెరిగిన వాస్తవములను పయోగిస్తు వారెరుగని పరసంబంధ సత్యములను ఆయన వారికి గంభీరముగ ఉపదేశించెను.

అందువలన ఉపమానమనగా దైవిక సత్యమును అలంకార రీతిగా బోధించుటయని చెప్పవచ్చును. లేఖన ములలో మనకు ఉపమానము, సామెత, పోలిక, అలంకారము అనునవి కనబ డును. అలంకారభాషలో ఉపమానము పురాతనమైనది. పాతనిబంధన వాటితో నిండి యున్నది. యేసు తరచు ఉపమానరీతిగ బోధించెను.

**ఉపమానముల ప్రయోజనము:**

**1.** ఉపమానములు ఆత్మీయ సత్యమును బయలు పరచుటకు ఉపయోగింపబడెను. ప్రజలు ఎరుగని దానిని గ్రహించునట్లు వారెరిగిన వాస్తవముల ద్వారా బోధించ బడెను.

**2.** ఆత్మీయ సత్యముకు హక్కు లేనివారి నుండి దానిని దాచిపెట్టుటకు ఉపమానము ఉపయోగపడెను. అట్టివారికి సత్యము బయలు పరచబడినా దానిని వారు దుర్వినియోగము చేతురు.

**3.** సత్యమునకు మెరుగు పెట్టుటకు ఉపమానము వినియోగించబడెను.

**4.** అది వారినుద్దేశించి చెప్పబడెనని గ్రహించుకొనక ముందే ప్రజలు సత్యమును అంగీకరించునట్లు చేయు నిమిత్తము ఉపమానములు ఉద్దేశించబడెను.

**5.** తదుపరి మెస్సీయను గూర్చిన ప్రవచనములు నెరవేరునట్లు ప్రభువు ఉపమానరీతిగా బోధించెను. "ప్రవక్త చెప్పిన మాట నెరవేరునట్లు యేసు ఈ సంగతుల న్నిటిని జనసమూహములకు ఉపమాన రీతిగా బోధించెను; ఉపమానము లేక వారికేమియు బోధింపలేదు" (మత్తయి 13:34-35).

"జనులారా నాబోధకు చెవి యొగ్గుడి, నానోటి మాటలకు చెవి యొగ్గుడి. నేను నోరుతెరచి ఉపమానము చెప్పెదను. పూర్వకాలపు గూఢ వాక్యము

లను నేను తెలియజెప్పెదను" అని కీర్తన 78:1-2లో చెప్పబడిన ప్రవచన నెరవేర్పును యేసు బోధన విధానములో మనము చూడగలము.

మత్తయి సువార్త యేసు క్రీస్తు తన జీవితంలోను, బోధలోను పాతనిబంధన లేఖనములనెట్లు నెరవేర్చారో తెలియజేయుటకు వ్రాయబడియున్నది. ప్రవక్త ద్వారా "చెప్పబడిన మాట నెరవేరునట్లు" అను పదములను తరుచు మత్తయి సువార్తలో మనము కనుగొనగలము (మత్తయి 1:22;2:15,17,23;4:14).

**ఉపమానముల భావార్థము :**

ప్రభువు చెప్పిన రెండు ఉపమానములకు ఆయనే భావార్థము చెప్పెను. విత్తువానిని గూర్చినది మరియు గురుగులను గూర్చినది. యేసు ఈ రెండింటికి చెప్పిన భావార్థమును బట్టి మిగతా ఉపమానముల భావార్థమును గ్రహించుటకు మనకు తగినంత జ్ఞానమున్నదని అనుకొనుట సమంజసమే. యేసు ఈ రెండింటికి యిచ్చిన వివరణమిగతా ఉపమానముల వివరణకు మూలమై యుండుట అత్యవసరము. అయినను సరే ఈఉపమానముల భావార్థము విషయంలో కొందరు విభేధిస్తు యున్నారు. అందువలన శతాబ్దముల తరబడి మానవులు యేసు చెప్పిన ఉపమానములకు విపరీత భావార్థములు చెప్పుచున్నారు. కొందరు లేనిపోని సంగతులు కలిపి భావార్థము చెప్పుదురు, మరికొందరు ఉపమానములో యున్నవాటిని తీసివేతురు. అందువలన యేసు యొక్క ఉపమానములకు భావార్థము చెప్పునప్పుడు మనము కొన్ని జాగ్రత్తలువహించవలెను.

మొదటిగా ప్రతి ఉపమానము దాని సందర్భానుసారముగ చదువవలెను. ఆ ఉపమానము యొక్క చరిత్రాత్మక సందర్భమును గ్రహించుకోవాలి.

రెండవదిగా ఆ ఉపమానములో యున్న వివరములన్నియు గ్రహించుకోవాలి. కొన్ని ఉపమానములు సవిస్తరముగా యున్నవి, విత్తువానిని గూర్చినది మరియు గురుగులను గూర్చినది సవిస్తరముగా యున్నవి. మరికొన్నిటిలో వివరణయేమీ లేకబహుసంగ్రహముగా యున్నవి.

-లూయిస్ రష్మోర్

**గమనిక : వచ్చేసంచిక నుండి యేసు యొక్క ఉపమానముల శీరిక్షవరుసగా ప్రచురింపబడును పైన చెప్పినది ఉపోద్ఘాతము మాత్రమే. గనుక సత్యవాక్కును క్రమముగా చదువండి చదివించండి, -ఎడిటర్**

# ధన్యురాలైన వేశ్య
## (A Blessed Harlot)

అసామాన్యులయితేనే తప్ప స్త్రీల పేర్లు పరిశుద్ధ గ్రంథంలో వ్రాయబడలేదు. నోవహు భార్యపేరు గాని వారి కోడండ్ర పేర్లు గాని చెప్పబడలేదు. కొన్ని సందర్భాలలో స్త్రీల సంఖ్య కూడా లెక్కింపబడలేదు. ఐగుప్తు దాసత్వము నుండి ఆరులక్షల పురుషులు బయటకు రావడం జరిగింది గాని స్త్రీలు, పిల్లలు లెక్కింపబడలేదు. యేసుప్రభువు 5 రొట్టెలు రెండు చిన్న చేపలతో 5,000 మందికి ఆహారం పెట్టినపుడు ఆసంఖ్య పురుషులదే గాని స్త్రీలు, పిల్లలు లెక్కింపబడలేదు. ఇద్దరు మహిళల పేర్లతో పరిశుద్ధగ్రంథంలో రెండు పుస్తకములు - రూతు, ఎస్తేరు గ్రంథాలు వ్రాయబడినవి.

యేసు ప్రభువువారి వంశావళిలో ముగ్గురు మహిళల పేర్లు చూస్తాము అన్యులైన ఈ ముగ్గురు స్త్రీలు ఎవరనగా తామారు, రాహాబు, రూతు (మత్తయి 1: 3-6). కనానీయురాలైన తామారు భక్తిగలది (ఆది 38:26). మోయాబీయురాలైన రూతు ఇశ్రాయేలు దేశములో తన అత్తతో ఉండులాగున తన స్వదేశాన్ని విడిచిపెట్టింది. రాహాబు యెరికో పట్టణానికి చెందిన వేశ్య. యెహోషువా గ్రంథంలో 2,6 అధ్యాయాలలో మనము ఆమెను గురించి చదువగలము.

యెహోవా దేవుని బలమైన హస్తము ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తుబానిసత్వం నుండి బయటకు తీసికొని వచ్చింది. వారి అవిధేయత, అవిశ్వాసముల వల్ల 40 సం॥లు వారు అరణ్యంలో తిరుగులాడారు. మోషే మరణం తరువాత యెహోషువ వారి నాయకుడయ్యాడు. యెరికోనుండి 12 మైళ్ల దూరంలోనున్న షిత్తీము అను ప్రాంతము నుండి వేగుచూచుటకు అతడు ఇద్దరు వేగులవారిని పంపించాడు.

ఆమనుష్యులు రాహాబు అను వేశ్య ఇంట దిగారు. రాజు ఆ ఇద్దరి మనుష్యుల కొరకు తన సేవకులను ఆమె యొద్దకు పంపినపుడు, ఆమె వారిని తన మిద్దెపైన దాచి వారు వెళ్లిపోయినట్లు రాజు సేవకులతో అబద్ధం చెప్పింది (యెహోషువ 2:1-24).

వేగులవారిని దాచిపెట్టి తన స్వంత దేశ రాజుతో అబద్ధం చెబుటకు కారణమేమి? అది ఆమెకు ఆమె కుటుంబానికి ప్రాణాపాయం తెచ్చేటంత ప్రమాదకరమయింది. ఆమె యెరికో రాజుకంటే ఇశ్రాయేలీయుల దేవునికి అధికంగా భయపడింది. ఆమె వినినదానిని ఆమె విశ్వసించింది. ఆమె వారితో "యెహోవా ఈ దేశమును మీకిచ్చు

చున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈదేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీరు ఐగుప్తుదేశములో నుండి వచ్చినపుడు మీ యెదుట యెహోవా యెఱ్ఱసముద్రపు నీరును ఏలాగు ఆరిపోజేసెనో, యొర్దాను తీరమున నున్న ఆమోరీయుల ఇద్దరు రాజులైన సీహోనుకును ఓగుకును మీరేమి చేసితిరో అనగా మీరు వారిని ఏలాగు నిర్మూలముచేసితిరో ఆసంగతి మేము వింటిమి. మేము వినినపుడు మాగుండెలు కరిగిపోయెను. మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీ యెదుట ఎట్టి మనుష్యులకైనను ధైర్యమేమాత్రము ఉండదు" (యెహోషు 2:9-11). యెరికో పౌరులు కూడా ఈ విషయాలను గురించి విన్నారు గాని విశ్వసించలేదు (హెబ్రీ 11:31). నోవహు దినముల లోను, లోతుదినములలోను ప్రజలు ఇట్టి హెచ్చరికలను లక్ష్యం చేయక నశించి పోయారు (అది 7:23,19:25,1 పేతురు 2:6).

ఇశ్రాయేలీయుల జీవితంలో దేవుడు చేసిన గొప్ప కార్యములను గురించి రాహాబు విని ఆయనకు భయపడింది. యెహోవాయందలి భయము జ్ఞానము నకు మూలము (సామె 1:3). ఇస్సాకును బలి ఇచ్చుటకు అబ్రహాము సిద్ధపడిన బలిపీఠము వద్ద ప్రభువు అబ్రహాముతో అన్నారు " నీవు దేవునికి భయపడు వాడవని యిందువలన నాకు కనబడు చున్నదనెను". (అది 22:12). యోసేపు దేవునికి భయపడి పోతీఫరు భార్య యొక్క కోరికనుండి పారిపోయాడు (ఆది 39:9). యోబు యదార్థ వంతుడు న్యాయవంతుడు. దేవునియందు భయ భక్తులు కలిగినవాడు (యోబు 1:8) అని పరిశుద్ధగ్రంథం చెబుతుంది. యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట చెడుతనమునసహ్యించు కొనుటయే. గర్వము, అహంకారము, దుర్మార్గత కుటిలమైన మాటలునసహ్యించు కొనుటయే. 128వ కీర్తనలో కీర్తనా కారుడు దేవుని యెడల భయభక్తు[illegible] గలవారికి కలుగు దీవెనలు వి[illegible] స్తున్నాడు. "యెహోవా యందు భ[illegible] భక్తులు కలిగి ఆయన త్రోవలయందు నడుచు వారందరు ధన్యులు. నీజీవిత కాల మంతయు యెరూషలేముకు క్షేమముకలుగుట చూచెదవు. నీ పిల్లల పిల్లలను నీవు చూచెదవు. ఇశ్రాయేలు మీద సమాధానముండును గాక" (కీర్తన 128:1-6). జ్ఞానియైన సొలొమోను అంటున్నాడు యెహోవాయందు భయ భక్తులు గల స్త్రీ కొనియాడబడును (సామె 31:30). రాహాబు దేవునికి భయపడి

నందు వల్ల ఆమె కొనియాడబడింది.

యెఱ్ఱసముద్రం పాయలు అయిన ప్పటికి యెరికోగోడలు కూలినప్పటికి మధ్యకాలం 40 సం॥లు. ఈ సంఘటన యెరికో ప్రజలకు సుస్పష్టం. దేవుని కార్యాలు ఆయన మాటలు నిత్యమైనవి. దేవుడు నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా నుండువాడు. గత సం॥ లేదా గత నెల లేదా గత వారంలో మనం వినిన దేవుని వాక్యాన్ని బట్టి మనము ఇంకా దేవునికి భయపడుచున్నామా? ప్రతి దినం దేవుని వాక్యాన్ని మనం వింటున్నపుడు దాని ప్రభావం మన పైన ఎంత కాలం ఉంటుంది? "నేను యజమానుడనైతే నాకు భయపడు వాడెక్కడ ఉన్నారు అని సైన్యముల కధిపతియగు యెహోవా అడుగుచున్నాడు" (మలాకి 1:6). "భయముతోను వణకుతోను మీ స్వంత రక్షణను కొనసాగించుకొనుడని" పౌలు మనలను హెచ్చరిస్తున్నాడు (ఫిలి 2:12).

క్రియలు లేని విశ్వాసము మృతము. దయ్యములు కూడా నమ్మి వణకుచున్నవి (యాకోబు 2:19). ఆమె చర్యలవల్ల రాహాబు కూడా నీతి మంతురాలుగా ఎంచబడింది. "రాహాబ అను వేశ్యకూడా దూతలను చేర్చుకొని వేరొక మార్గమున వారిని వెలుపలికి పంపివేసినపుడు క్రియల మూలముగా నీతిమంతురాలని యెంచ బడెనుగదా!" (యాకోబు 2:25). "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునైయున్నది". (హెబ్రీ 11:1). యెరికో పట్టణమును రోజుకు ఒకసారి చొప్పున ఆరుదినములు చుట్టి ఏడవ దినమున ఏడుపర్యాయాలు చుట్టి తిరగాలని ప్రభువు యెహోషువాకు ఆజ్ఞాపించారు. బూరల ధ్వనివల్ల, జనులం దరు ఆర్భాటముగా కేకలు వేయుట వల్ల యెరికో కోట గోడలు కూలెను. పట్టణము లోనున్నదంతయు వారు సంహరించిరి. రాహాబు అను వేశ్య యెరికోను వేగుచూ చుటకు యెహోషువ పంపిన దూతలను దాచి పెట్టియుండెను. గనుక అతడు ఆమెను ఆమెతండ్రియింటి వారిని ఆమెకు కలిగిన వారినందరిని బ్రతుకనిచ్చెను (యెహోషువ 6:25).

విశ్వాస వీరుల జాబితాలో హెబ్రీ గ్రంథకర్త ఇద్దరు స్త్రీలను మాత్రమే పేర్కొనడం జరిగింది. "విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగుల వారిని సమాధా నముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపక పోయెను" (హెబ్రీ 11:31). అన్యురాలైన రాహాబు నాశన కరమైన పట్టణమునకు చెందినదయినప్పటికి భూమ్యాకాశములను కలుగ చేసిన ప్రభువుకు భయపడింది. "యెహోవా మహాత్మ్యముగల వాడు, ఆయన అధిక

స్తోత్రము పొందతగిన వాడు. సమస్త దేవతల కంటెను ఆయన పూజనీయుడు" (కీర్తన 96:4). "వారు ఆదేశము మీద బ్రతుకు దినములన్నీయు నాకు భయపడ నేర్చు కొని తమ పిల్లలకు నేర్పునట్లు వారికి నా మాటలు వినిపించెదను". (ద్వితి 4:10). బోధకులు, పెద్దలు లిఖించిన ఆయన మాటల ద్వారా మనము ఆయన స్వరము వినునట్లు ఆయన చేయు చున్నారు. ఆయనకు మనం భయపడు చున్నామా ?

వాగ్దాన దేశంలోకి ప్రవేశించిక పూర్వం ప్రభువు మోషేకు ఇలా ఆజ్ఞాపించారు. "నీవు వారితో నిబంధన చేసికొనకూడదు, వారిని కరుణింప కూడదు, నీవు వారితో వియ్యమంద కూడదు. వాని కుమారునికి నీకుమార్తె నియ్యకూడదు, నీకుమారునికి వాని కుమార్తెను పుచ్చుకొనకూడదు". (ద్వితి 7:2-3). అన్యులైన వారితో వైవాహిక సంబంధాలు పెట్టుకొనకూడదని ప్రభువు ఇశ్రాయేలీయులను పదే పదే హెచ్చరించారు. గాని రాహాబు వేశ్య అయి ఉండి కూడా యూదా గోత్రానికి నేటి వరకు ఇశ్రాయేలీయుల మధ్య నివసించుచున్నది (యెహోషువ 6:25).

రాహాబు దేవునికి భయపడి, యెహోషువ పెట్టిన షరతులకు లోబడి ధన్యురాలైంది. యేసుప్రభువు వారి వంశావళిలో స్థానం పొందింది. మనం కూడా ఆయనకు నిరంతరము భయపడుతూ దేవుని వాక్యానికి లోబడుతూ ఉంటే మన జీవితాలు కూడా ధన్యమైనవి.

"భూమికంటే ఆకాశము ఎంత ఉన్నతముగానున్నదో ఆయన యందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగానున్నది," (కీర్తన 103: 11) అని కీర్తని కారుడు చెబుతున్నాడు.

దేవుని యందు భయభక్తులు కలిగి యుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి" అని జ్ఞానియైన సొలొమోను కూడా తన ప్రబోధాలను ముగించాడు. గనుక దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలలోనడుచు ధన్యత ఆయనే మనకనుగ్రహించుగాక.

- కవిత గూటం, కాకినాడ

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# త్రితాప జయశీలి
## (Trilust Vanquisher)

"తాపత్రయము" అంటే మూడు ఆశలు (Trilust means three desires), తాపములు, ఆరాటములు , తపనలు, వాంఛలు, అపేక్షలు, మోహములు, కోరికలు. తాపం అంటే ఆశ: త్రయం అంటే మూడు. తాపం అంటే ఉష్ణం, వేడి, ఆందోళన అనే అర్థాలు కూడా ఉన్నాయి. మనిషి తీవ్ర ఉద్విగ్నాలకు లోనైతే లేక ఉద్రిక్తమైన సమయాల్లోను శారీరక మానసిక స్థితుల్లో తాపకరమైన మార్పు సంభవిస్తాది.

"ఆశ" నుండి క్రోధ మద మత్సరం అను మూడు పాపాలు ఉద్భవిస్తాయి - ఈ మూడింటి నుండి మిగిలిన అన్ని పాపాలు ఉత్పన్నమౌతాయి. కోపం, గర్వం అసూయ అనే మూడు తాపములను శరీరాశ, నేత్రాశ, జీవపుబడంబం అని దైవవాక్కు చెబుతోంది. "తాపత్రయము" అనే ఈ అంకురపాపాలను (root-sins) జయించువాడే "త్రితాప జయశీలి". నిజక్రైస్తవుడు ఇట్లు జయశీలునిగా జీవించాలని దేవుని చిత్తం. "తుదకు, మానవుడు తనపై తాను క్రమశిక్షణ చేసుకొను శక్తిని మాత్రమే కోరుకొనవలె" నని ఈలీ వీసెల్ చెప్పాడు. నిన్ను నీవే అదుపులో పెట్టుకొనగలిగితే - నీవొక రాజువే !

అపవాది పొదిలో అనేక అస్త్రములున్నను వాటన్నిటికి మూలం దురాశయే, ఆశ (wanting)అన్ని పాపాలకు మూలకారణం ఉత్పన్నమౌతాయి. పాపాలన్నీ కోపం, గర్వం, అసూయ అనే మూడు అంకుర పాపాల క్రింద వస్తాయి: "లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు: అవి లోక సంబంధమైనవే" (1యోహాను 2:16). "దురాశల నుండి పారిపో" (2తిమోతి 2:22). ఫలప్రదమైన మానవ లక్షణాలను (human traits) పెంపొందించుటానికి ప్రయాసపడు. నీవు స్వశిక్షణను (self-discipline) అలవరుచుకొంటే, అది యాతనకరమైన ఉద్రేకములను, క్షోభపెట్టు వైఖరులను, మరులుగొల్పు ఆశలను, దు:ఖకరమైన నడతల నుండి నిన్ను విముక్తి చేస్తుంది. నీ జీవితములో కలిగిన ఈ పరివర్తన వలనైన నూతన ప్రవర్తన ఆరోగ్యకరమైన మానవ సంబంధాలను (human relations) పరిణతిచెందిన ఆధ్యాత్మిక జీవితాన్ని అందిస్తాది.

"దేవుని చట్టాన్ని అతిక్రమించుటయే పాపం" (1యోహాను 3:4). తన

ప్రతి బిడ్డ "వినయముగా ఉండాలి" అని దేవుడు చెబుతున్నారు. ఇది ఆయన ఆజ్ఞ. నీవు ఆయన శాసనానికి విధేయుడవై దాన్ని పాటించాలి. నీవు వినయం లేకుండా జీవిస్తున్నట్లయితే నీవు దేవుని చట్టాన్ని ధిక్కరిస్తున్నావు, ఆయనపై తిరుగుబాటు చేస్తున్నావు, ఆయన దృష్టిలో నీవు పాపిగా మారుచున్నావు "తిరుగుబాటు చేయుట సోదెచెప్పుటయను పాపముతో సమానము; మూర్ఖతను అగపరచుట మాయావిగ్రహములను పూజించుటతో సమానము" (1 సమూయేలు 15:23). దేవునికి అవిధేయత చూపించుటయే అన్ని పాపాలకు మూలకారణం.

మానవులందరు ఒకే విధముగా తమ ఉద్రేకములకు శోధనలకు లోను కాకున్నను, అందరు తమ తమ అభిరుచులను ప్రగాఢమైన వాంఛలను కల్గియుంటారు. ఎవడును ఒకే సమయములో –కోపముతో సంతోషముగను, గర్వముతో మర్యాదగను, అసూయతో అనందముగను ఉండలేడు. "నరుని కోపం దేవుని నీతిని నెరవేర్చదు" (యాకోబు 1:20). గనుక వికృతమైన ఈ కోపచిత్తాన్ని క్షమాగుణ అభ్యాసన ద్వారా అదుపు చేసుకొన్నట్లయితే జీవితం సుఖమయమౌతుంది; గర్వం వినయానికి లోబడితే జీవితం అనూహ్యముగా ఎదుగుతుంది; అసూయ సంతృప్తిగా మారినప్పుడు జీవితములో సమాధానం ఏలుతుంది, అప్పుడు లోకం ఎంతో రమణీయముగా కన్పిస్తుంది.

"ఒకనినొకడు క్షమించండి" యని ప్రభువు చెప్పారు. ఇది దేవుని ఆదేశం. నీవు క్షమాగుణాన్ని అభ్యసించ వలసినదే. ఈ ఆదేశం నుండి తప్పించుకొనే మార్గం లేదు. "కాబట్టి మేలైనది చేయ నెరిగియు అలాగు చేయని వానికి పాపము కల్గును" (యాకోబు 4:17). క్షమాతత్వాన్ని అభ్యసించుట నీకును నీ చుట్టూ ఉన్న వారికి మేలు. నీవు క్షమించకపోతే, అది దేవునిపై తిరుగుబాటే. నీవు ప్రభువుకు వ్యతిరేకముగా చేసిన వాటిని ఆయన కూడ క్షమించరు. నీవు మేలు చేయగల్గియు చేయకపోతే, నీవు పాపం చేస్తున్నావు !

"గర్వించకు" అని దేవుడు ఆజ్ఞాపిస్తున్నారు గనుక గర్వం కల్గియుండవద్దు. ఎందుకంటే పాపముల జాబితాలో గర్వం కూడ చేర్చబడింది: "వారు మనస్సులో దేవునికి చోటియ్యనొల్లకపోయిరి.... అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను దుష్టత్వముచేతను లోభముచేతను ఈర్ష్యచేతను నిండుకొని మత్సరము నరహత్య కలహము కపటము వైరమను వాటితో నిండినవారై ... దేవద్వేషులును హింసకులును ... నరహత్య కలహము కపటము వైరమను వాటితో నిండినవారై దేవద్వేషులును హింసకులు....

అహంకారులు.... మాటతప్పువారును... నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని బాగుగ ఎరిగియుండియు, వాటిని అభ్యసించుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించువారితో సంతోషముతో సమ్మతించుచున్నారు" (రోమా 1: 28-32). "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహిస్తాడు" (1పేతురు 5:5). మొదట నిన్ను నీవు మార్చుకో. పిమ్మట నీ చుట్టు ఉన్నవారు పరివర్తన చెందటానికి సహకరించు.

"అసూయపడవద్దు" -ఇది ప్రభుని ఆజ్ఞ. దేవుని ఏ నిర్దేశాన్ని కూడ నీవు తేలికగా తీసుకోకూడదు. అసూయపడుట పాపం. ఇది ఇతర శారీరక క్రియల జాబితాలో సరిసమానముగా చేర్చబడింది: "అవేవనగా, జారత్వము... విగ్రహారాధన ... ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు..... అసూయలు.... ఇట్టివాటిని చేయువారు దేవునిరాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను" (గలతీ 5:19-21).

నీవు క్రోధ గర్వ ఈర్ష్యలను వ్యక్తం చేసినపుడు అవి అన్ని ఇతర పాపాలవలెనే నీ ఆత్మను నాశనం చేస్తాయి. గనుక "క్షమాపణ వినయం సంతృప్తి" అను సద్గుణాలను అభ్యసించు. "దేవుడే నా కాపరి నాకేమియు అక్కరలేదు" అనే మౌలిక సూత్రాన్ని ప్రతి క్రైస్తవుడు నమ్మాలి. ఇదియే ముందస్తు జాగ్రత్త. త్రితాప నివారిణి. ఈ పాపపు బారినుండి తప్పించుకోటానికి ఇదే ఉత్తమ మార్గం.

నీ అనుదిన దైవవాక్కుల పఠనం నీ జీవితం రూపాంతరం చెందటానికి మరి లెస్సైన మనుగడ సాగించటానికి నీకు సదా తోడ్పడును గాక !

-పి.ఐ. సబ్బతి, హైదరాబాదు.

## మరియ చేసిన ఆరాధన
## (Mary's Worship)

సామూహిక ఆరాధనలో మనం పాలుపంచుకోవాలి. అయినను దేవుడు ప్రతి మానవుని యొక్క హృదయాన్ని పరికిస్తూ యుంటారని, సంఘపరముగా మనం ఆరాధించి నా,ఆరాధన వ్యక్తిగతమేయని గ్రహించుకోవాలి. మనం జీవించునట్లు మనకొరకు మరణించుటకు తన ఏకైక కుమారుని పంపిన దేవుని యెదుట మనలో ప్రతివాడు సాష్టాంగపడవలెను. దానిని హృదయ పూర్వ

కముగా అయన చిత్తము ననుసరించి చేయవలెను (యోహాను 4:24). ప్రభువును మరియు అభిషేకించిన సందర్భము చదువుట ద్వారా ఆరాధనను గూర్చిన కొన్ని ప్రాముఖ్య సంగతులు తెలిసికొనగలము మరియు ఆత్మీయముగా ఎదుగ గలము (యోహాను 12:1-8; మత్తయి 26:6-13; మార్కు 14:3-9).

యేసు బేతనియలో కుష్ఠరోగియైన సీమోను ఇంటనున్నప్పుడు మరియ మిక్కిలి విలువగల అత్తరుబుడ్డి తీసికొని ఆయన యొద్దకు వచ్చి దానిని ఆయన తలమీద పోసెను. మరియ ఈ పనిని తన యొక్క కృతజ్ఞతను వ్యక్తపరుచుటకు చేసెను. ప్రభువు యొక్క పాదముల యొద్ద కూర్చొని ఆయన మాటలను వినుతరుణములను ఆమె పొంది దీవించబడెను. తన సోదరుడైన లాజరును అంతకుముందే ఆయన మృతులలోనుండి లేపి బ్రదికించెను. గనుక ఆయన తలను పాదములను మిక్కిలి సువాసన యిచ్చు అత్తరుతో ఆమె అభిషేకించుట సరియైన పనియే. అదే రీతిగా తన పాపపు జీవితమును గుర్తించిన ప్రతివాడు ప్రభువుకు కృతజ్ఞత చెల్లించునట్లు ఆయన యొద్దకు మరియ వలె చేరవలెను (రోమా 3:10,23; 6:23; 1 పేతురు 1:18-19). అందుకే "ప్రతివిషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి; ఈలాగు చేయుట యేసుక్రీసునందు మీ విషయములో దేవుని చిత్తము" అని పౌలు చెప్పెను (థెస్స 5:18).

మరియ చేసిన పని త్యాగ పూరితమైనది. ఆ అత్తరు మూడు వందల దేనారములకు అమ్మివేయ వచ్చునుగదాయని ఇస్కరి యోతు యూదా చెప్పాడు. ద్రాక్షతోటలో పనిచేయుటకు వెళ్లిన కూలి వారిని గూర్చి మత్తయి 20తో యేసు చెప్పారు. ఉదయమున పనికి వచ్చినవారికి ఒక్కోదేనారము వాగ్దానము చేయ బడెను. దీనిని బట్టి మరియ ఒక సంవత్సరకూలి ధనమును ఆరోజు ప్రభువు కొరకు వినియోగించినది ! ఆ అత్తరులో ఒకటి రెండు చుక్కలను తన వ్రేలిపై వేసికొని ఆయనకు వ్రాయలేదు. ఆరోజులలో అత్తరును అలాగే వాడేవారు గాని ఆమె అత్తరు బుడ్డిని పగులగొట్టి దానిలోని దంతటిని ఆయనపై ప్రయోగించింది. అది ఎంత విస్తారమైనదంటే ఆ ద్రావకము యేసు తలమీద నుండి క్రింది ప్రాకుచుండగా దానిని తుడుచుటకు ఆమె తన తలవెంట్రుకల నుపయోగించింది. "ఇల్లు అంతయు అత్తరు వాసనతో నిండెను" అని యోహాను వ్రాసాడు. అదే రీతిగా నేడు మనం ఆరాధన చేయునప్పుడు త్యాగపూరితముగా దేవునికి ఇయ్యాలి, మనలను పాపము

నుండి విడుదల చేయుటకు ఆయన తన ఏకైక కుమారుని యిచ్చారు గదా! (రోమా 12:1-2) (2 కొరింథీ 9:15).

విచారం యేమంటే, మరియ యొక్క పరిచర్య విమర్శకు గురియైనది. ఆ అత్తరు అమ్మి దాని వెలను బీదలకు ఇయ్యవచ్చును గదాయని ఇస్కరియోతు యూదా విమర్శించుట మొదలు పెట్టాడు. అతడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధ కలిగి కాదు గాని వాడు దొంగయై యుండి తన దగ్గర డబ్బు సంచి యుండినందున దానిలోనుండి వాడు దొంగిలుచువచ్చెను గనుక ఆలాగు చెప్పెనని యోహాను మనకు తెలియజేయుచున్నాడు. యూదా విమర్శించుట మొదలు పెట్టిన తరువాత యితరులును ఆమె ఆయత్తరును నష్టపరచనేల? యని విమర్శించిరి (మార్కు 14:4,5). అయినను మరియ వలె యితరులు మనలను విమర్శించినా, మన అర్పణలను దేవునికి అర్పించుటకు వెనుకాడ కూడదు.

మరియ చేసిన ఆరాధన అసాధారణమైనది. యేసు ఆమెను గూర్చి ఇట్లు చెప్పారు. "నన్నుపాతిపెట్టు దినమునకు ఆమెను దీనినుంచు కొననీయ్యుడి; బీదలు ఎల్లప్పుడు మీతో కూడ ఉందురు గాని నేనెల్లప్పుడు మీతో కూడ ఉండను" (యోహాను 12:16). ఇంకొక మాటలో యేసు ఇంకా బ్రదికి యుండగానే, సమాధి కొరకు ఆయన శరీరమును అభిషేకించి సిద్ధపరచుట కొరకు మరియ ఆ పనిచేసెను. (యోహాను 12:4,5; మార్కు 14:8). నీకొదేము నూటయేబదిసేర్ల యెత్తుగల బోళముతో కలిపిన అగరును తెచ్చి ఆయన మృత దేహమును సమాధికి ముందు సిద్ధపరచెను. గాని మరియ అయితే ఆయన ఆ సుగంధ ద్రవ్యమును వాసన చూడగల్గునట్లు ఆయన బ్రదికి యుండగానే ఆయన దేహమును సిద్ధపరచెను. మనము చేసే ఆరాధన అసాధారణము కాకపోయినను, యితరులను క్రీస్తులోనికి ఆకర్షించునట్లు మన ఆత్మీయ సువాసన వెదజల్లునట్లు దిగా యుండవలెను.

అన్నిటికంటె ముఖ్యముగా మరియ యొక్క పరిచర్యను ప్రభువు అంగీకరించారు. మార్కు వ్రాసిన దానిని బట్టి యిది మనకు వ్యక్తమగుచున్నది. "ఈమె నా యెడల మంచి కార్యము చేసెను. ఈమె తన శక్తి కొలది చేసెను" అని ఆయన చెప్పెను (మార్కు 14:6-7). తరువాత "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసింప బడునని మీతో నిశ్చయముగా చెప్పుచు న్నానని" యేసు చెప్పెను (మార్కు 14:8,9). తాను ఎవరిని ఆరాధించు

మండెనో, ఆయన దగ్గర నుండియే ఈ అభినందన వచనములు వచ్చుట చాల ప్రాముఖ్యము.

మన ధేయ్యము కూడా అదే అయ్యుండాలి. ఆరాధించి ప్రభువును మనం వ్యక్తిగతముగా ఘనపరచుదుము. మన ఆరాధన ఆయనకు అంగీకార యోగ్యమైనదై యుండాలి.

-గేరీ హాంప్టన్

## దేవునివాక్యము

(God's word)

చాలా శక్తివంతమైన దూర దర్శినులు ఇప్పుడున్నాయి. అయితే భూమికి సమీపముగా యున్న నక్షత్రము నుండి భూమిని చూపించగలిగే దూర దర్శిని మాత్రము ఇంకా తయారు చేయబడ లేదు. అయితే భూమిని మాత్రమే కాదు,దానిని మించి చూడ గలిగే యంత్రము ఒకటి యున్నది. అది ఎంత ప్రత్యేకమైనదంటే దాని వలన మానవుడు గతాన్ని మాత్రమే గాక భవిష్యత్కాలము చూడగల్గునట్లు చేయగల పరికరమే దేవుని వాక్యము, బైబిలు గ్రంథము.దేవుని వాక్యము ద్వారా దేవుడు సృజించిన లోకమును దానిలోని జీవ రాశులను చూడగలము (హెబ్రీ 11:3). ఆయన ప్రేమను కనుగొనగలము. (యోహాను 3:16) మరియు మన పాపముల నిమిత్తమై మరణించిన రక్షకుని కనుగొనగలము (రోమా 5:6-11).

కొందరు బహుధనవంతులైన బంధువులను కలిగియున్నారు. వారు తమ బంధువులకు కోట్లాది రూపాయల సంపత్తును స్వాస్థ్యముగా ఇయ్యగలరు. అయితే రక్షింపబడిన వారిలోగల స్వాస్థ్యమును ఏ మానవుడు ఇయ్యలేడు. దేవుని వాక్యము ఒక్కటి మాత్రమే దానిని చేయగలదు.మనము సువార్తకులోబడి వాక్యప్రకారము నడుచుకుంటే అది సాధ్యమే (అపో.కా.20:32).

అందువలననే ఇశ్రాయేలీయుల మధుర గాయకుడైన దావీదు ఇట్లు వ్రాసాడు"నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొంది యుండుట నాకు మేలాయెను. వేలకొలది వెండి బంగారు నాణెముల కంటె నీవిచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలాయెను"(కీర్తన 119:71). మరల "నీధర్మశాస్త్రము నాకెంతో ప్రియముగానున్నది. దినమెల్ల నేను దానిని ధ్యానించుచున్నాను"(కీర్తన 199:97)

- జెర్రీ జెంకిన్స్

2013 ఫిబ్రువరి 8వ తేదీ శుక్రవారం సికింద్రాబాద్ యాప్రల్‌లో సహోదరులు లెమూయేలు ఆచారి గారు నిర్మించిన నాలుగు అంతస్థుల భవంతిని జాషువా గూటం గారి యొక్కయు,పలువురు దైవజనుల యొక్కయు చేతుల మీదుగా ప్రార్థనలతో ప్రారంభించబడెను. తదుపరి జరిగిన కూటములో జాషువా గారు తదితరులు మంచి వాక్య పరిచర్య చేసిరి. సోదరులు వై.సురేంద్రకుమార్ గారు ఆ కార్యక్రమమునంతటినీ ఘనముగా నిర్వహించిరి. హాజరైన పట్టణ ప్రముఖులకు,దైవజనులకు,బంధు మిత్రులకు లెమూయేలు దంపతులు మంచి విందు నేర్పాటు చేసిరి. సికింద్రాబాదు పట్టణములో క్రీస్తుకొరకు మంచి మాదిరిగా యున్న లెమూయేలు గారి కుటుంబమును అందరు అభినందించిరి,ఆశీర్వదించిరి.

2013 ఫిబ్రువరి 15వ తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి-క్రీస్తుసంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. ఉభయ గోదావరి జిల్లాల నుండియు,తదితర జిల్లాలు, ఒరిస్సా నుండియు పలువురు సువార్తికులు హాజరైరి. ఆ సదస్సులో అమెరికా నుండి వచ్చిన సోదరులు జేకరిచ మరియు కీత్ పార్కం గార్లు వాక్యపరిచర్య చేసిరి. ముఖ్యముగా కీత్ పార్కర్ గారు అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన సువార్తికులైనందున ఉదయము, మధ్యాహ్నము కూడ ఎక్కువగా ఆయనే వాక్యపరిచర్య చేసిరి. ఆయనకున్న బైబిల్ జ్ఞానమ్ము అద్భుతము. సోదరులడిగ్గిన అనేక బైబిలు ప్రశ్నలకు బైబిలు ద్వారానే ఆయన జవాబిచ్చిరి.

2013 ఫిబ్రువరి 17,18,19 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట స్థానిక సంఘము ఏర్పాటు చేసిన సువార్త కూటములలో కూడ పైనుదహరించిన సోదరులు గొప్ప వాక్యపరిచర్య చేయగా రిక్కీ గూటం గారు , జాషువా గూటం గార్లు తర్జుమా చేయుటలో సహకరించిరి. కొత్తపేట క్రీస్తుసంఘము కూటముల విషయమై విస్తృత ఏర్పాట్లు చేసి, జయకరముగా కూటములను ముగించిరి.

2013 ఫిబ్రువరి 26వ తేదీ మంగళవారం కృష్ణాజిల్లా దుళ్లవాని గూడెంలో ప్రత్యేక సువార్తకూటము జరిగెను. పరిసర గ్రామముల సువార్తికులు, పలువురు సంఘసభ్యులు హాజరుకాగా సోదరులు రిక్కీగూటం గారు మంచి వాక్యపరిచర్య చేసిరి. దుళ్లవానిగూడెంలో సోదరులు డి.సుజిత్ ప్రేమ్ గారు సువార్త పని చేయుచున్నారు.

## మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

**Satya Vani**

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004